




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

మంగళవారం | 07 అక్టోబరు 2025

పేజీలు 8


## దివ్య క్షేత్రంగా..

# శ్రీశైల మల్లన్న క్షేత్రం

- తిరుమల తరహాలో శ్రీశైలం అభివృద్ధికి కార్యాచరణ
- అటవీ శాఖ అధికారులతో సమీక్షించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- సీఎం ఆదేశాలతో శ్రీశైలం సమాగ్రాభివృద్ధిపై సచివాలయంలో మంత్రి సమావేశం
- శ్రీశైలం అభివృద్ధి దిశగా కీలక అడుగులు

2 లో



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

## టమోటా రైతులకు అండగా ఉంటాం



రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

- రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి హామీ
- రెండవ గ్రేడ్ టమోటాలు రోడ్డు పై వేసి గందరగోళం సృష్టిస్తున్నారు
- టమోటా ధరలు మంచి ట్రేడింగ్‌లో ఉన్నాయి
- రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

2 లో


**కర్నూలు,మేజర్‌న్యూస్‌బ్యూరో:** జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న ప్రచార కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించబోతున్న నేపథ్యంలో 3లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్,ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పరిశ్రమలు, ఆహార శుద్ధిశాఖమంత్రి టి.జి.భరత్, రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిలు తెలిపారు.ప్రధాని కర్నూలులో పర్యటన ఏర్పాట్లపై సోమవారం స్థానిక ప్రభుత్వ అతిధిగృహంలో అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో

- రోడ్‌షో స్థానంలో బహిరంగసభ
- సభ నిర్వహణ కోసం స్థలాలను పరిశీలించిన రాష్ట్ర మంత్రులు
- రాగమయూరి,నన్నూరు టోల్‌గేట్, గుట్టపాడు పరిశీలన
- ప్రతిష్ఠాత్మక కార్యక్రమం.. లోటు లేకుండా చూసుకోండి..
- అధికారులతో సమీక్షించిన మంత్రులు

## 3 లక్షల మందితో

# "నమో" సభ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రుల బృందం

## అకాల వర్షం – అపార నష్టం

- తడిసి ముద్దయిన మొక్కజొన్నలు
- నష్టపోయాం ఆదుకోండి

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** సోమవారం తెల్లవారుజాము నుండి ఉదయం వరకు చాగలమర్రి మండలంలో కురిసిన వర్షం నంద్యాల జిల్లాలోనే అత్యధికంగా 75.2 మి.మిలుగా నమోదైనట్లు జిల్లా రెవెన్యు శాఖ అధికారులు ప్రకటించారు.దీంతో మండలంలో రైతులు అత్యధికంగా 4800ల ఎకరాల్లో సాగు చేపట్టిన

మిగతా 2లో



## తగ్గించిన జీఎస్టీతో ప్రజలకు లబ్ధి

- అవగాహన ప్రదర్శన, షాపింగ్ ను ప్రారంభించిన జాయింట్ కలెక్టర్



జీఎస్టీ తగ్గింపు ప్రదర్శన,షాపింగ్‌ను ప్రారంభిస్తున్న కర్నూలు జేసి నవ్య

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తగ్గించిన జిఎస్టిని ప్రజలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ప్రజలను కోరారు. సోమవారం ఉదయం బళ్ళారి చౌరస్తా దగ్గర ఎస్.ఏ.పీ క్యాంప్‌కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జీఎస్టీ తగ్గింపు ప్రదర్శనను

మిగతా 2లో

## పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డిఎంహెచ్ఓ డాక్టర్.రఘునందన్

2 లో



డిఎంఏ డా. రఘునందన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ

## కలిసి పని చేస్తే "స్వచ్ఛ ఆంధ్ర" సాధ్యం

8లో

# వామపక్ష భావజాలం వద్దు..అభివృద్ధి ముద్దు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీజీ వెంకటేష్ తదితరులు

- ఏపీ అభివృద్ధిలో బీజేపీ కీలకపాత్ర
- అట్టహాసంగా బీజేవైఎం రాష్ట్రాధ్యక్షుడి ప్రయాణం

**కర్నూలు మేజర్‌న్యూస్‌:** వామపక్ష భావజాలంతో ఒరిగింది ఏమిలేదని వంద సంవత్సరాల క్రితం ఆ భావజాలంవైపు మొగ్గుచూపారని కాని అదే వంద సంవత్సరాల తరువాత యువత ఆ భావజాలాన్ని వీడి సమాజ సేవలో ముందుంటున్నారని బీజేపీ నాయకులు గుర్తు చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని బిఏఎస్ కళ్యాణ మండపంలో బిజెవైఎం నూతన రాష్ట్ర అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సునీల్‌కుమార్‌రెడ్డి నగరంలోని మౌర్యాఇన్ నుండి ఆర్ఎస్ రోడ్ సర్కిల్ రాజ్‌విహార్, పాతకంట్రోల్ రూం సర్కిల్, స్టేట్ బ్యాంక్ సర్కిల్ మీదుగా బిఏఎస్ కళ్యాణ మండపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాదవ్, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రమేష్ నాయుడులు పాల్గొన్నారు. అనంతరం బిఏఎస్ కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాదవ్, మాజీ రాజ్యసభ సభ్యులు

మిగతా 2లో

# 3 లక్షల మందితో "నమో" సభ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా పాల్గొనున్నారు. ఈ సందర్భంగా కర్నూలు నగరంలో రోడ్‌షో నిర్వహించాలని ముందు నిర్ణయించినా ఇరుకైన రోడ్లలో రోడ్‌షోకు ప్రధాని సెక్యూరిటీ నుండి అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో బహిరంగసభకు అనువైన స్థలాలను మంత్రుల బృందం పరిశీలించింది. నన్నూరు టోల్‌ప్లాజా, అక్కడే ఉన్న రాగమయూరి టౌన్‌షిప్, గుట్టపాడు వద్ద స్థలాలను మంత్రులు పరిశీలించారు. ప్రధాని మోదీ బహిరంగసభ ఈ ప్రాంతాల్లో జరిగే అవకాశం ఉంది. 3లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్న సభకు 100 ఎకరాల స్థలం అవసరం అవుతుందని అంచనా వేస్తున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, ఏర్పాట్లలో ఎక్కడా లోపం ఉండకుండా చూసుకోవాలని సూచించారు. జీఎస్టీ సంస్కరణలతో కేంద్రంపై భారం పడుతున్నా పేద, మధ్య తరగతి ప్రజల కోసం మోదీ నిర్ణయం తీసుకున్నారని, 2లక్షల కోట్ల రూపాయల భారం ప్రజలపై తగ్గిందని ఆయన చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలన్నీ తగ్గాయని ఆయన చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు కర్నూలులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధాని సభ కోసం వేదిక నిర్మాణం, ప్రజలు సభకు వచ్చేందుకు వీలుగా బస్సులు ఏర్పాటు చేయాలని చెప్పారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సభా నిర్వహణకు వీలుగా రోడ్ల కనెక్టివిటీ పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి ఎస్ఇలను ఆదేశించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ సభా నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన వీరపాండియన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఉమ్మడి జిల్లాలో ప్రధాని పర్యటనను విజయవంతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీలు బిటి నాయుడు, బీద రవిచంద్ర, కర్నూలు, నంద్యాల జిల్లా ఎస్పీలు విక్రాంత్‌పాటిల్, సునీల్ షెరాన్,ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి (డోన్), గౌరు చరిత (పాణ్యం), భూమా అఖిలప్రియ (ఆళ్లగడ్డ), డాక్టర్ పార్థసారధి (ఆదోని), బొగ్గుల దస్తగిరి (కోడుమూరు), కెడిసిసి బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు డా. ఏ.సిరి, గణియా రాజకుమారి, తెదేపా జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, జనసేన జిల్లా కన్వీనర్ చింతా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వామపక్ష భావజాలం వద్దు..అభివృద్ధి ముద్దు..

(మొదటి పేజీ తరువాయి)

టిజి వెంకటేష్, ఆదోని ఎంఎల్ఏ డాక్టర్ పార్థసారధి,టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, బిజెవైఎం మాజీ రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పార్టీకి అత్యధికంగా యువతకు ప్రాధాన్యమిస్తున్న పార్టీ అందుకే ఎక్కడో సమాన్య కార్యకర్తలు ఉన్న వ్యక్తులు నేడు ఉన్నత పదవులను చేపట్టి ఘనత బిజెపిలోనే ఉందన్నారు. వామ పక్షభావజాలంతో సాధించేది ఏమిలేదని అందుకే నేడు ఆ పార్టీలు దేశంలో ఉనికిని కోల్పోయాన్నారు. బిజెవైఎంలో పని చేసిన నాయకులు నేడు రాష్ట్ర దేశంలో ఉన్నత పదవుల్లో ఉన్నారని గుర్తుచేశారు. దేశంలోనే ఎన్నడు లేని విధంగా సంస్కరణలు తెచ్చి ఆర్థికంగా దేశాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోడి ఆధ్వర్యంలో ముందుకు సాగుతోందన్నారు. ఆపరేషన్ సింధూర్ మొదలుకుని, బిఎస్‌టి తగ్గింపుల వరకు బిజెపి పార్టీ తరదైన ముద్రవేసిందని గుర్తు చేశారు. సామాన్యుడు కూడ స్వేచ్ఛగా ఉండాలనేది బిజెపి పార్టీ సంకల్పమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడ దేశంలో అనేక సంస్కరణలు చేపట్టేందుకు సిద్దంగా ఉన్నామని



మాట్లాడుతున్న బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాదవ్

ప్రకటించారు. బిజెవైఎం రాజకీయంగా ముందుకు వెళ్లాలనుకునే వారికి ఒక ప్లాట్‌ఫాంగా ఉందని అక్కడ నుండి ఉన్నత పదవులు చేపట్టవచ్చన్నారు. ఈ నెల 16వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోడి కర్నూలు జిల్లా పర్యటనను దిగ్విజయం చేసేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిద పాఠశాలల విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల నుండి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అకాల వర్షం -అపార నష్టం

(మొదటి పేజీ తరువాయి)

మొక్కజొన్న పంటకోత దశలో ఉండటంతో సుమారు 60 శాతం మందికి పైగా రైతులు పంటను నుర్పిడి చేసి రోడ్లపై ఆరబెట్టారు. అయితే సోమవారం అనుకోకుండా కురిసిన భారీ వర్షానికి మొక్కజొన్న ధాన్యం గింజలు వర్షపు నీళ్ళలో తడిసి ముద్ద అయ్యాయి. అంతే కాకుండ గింజలు నీళ్ళతో పాటు కొట్టుకోపోయాయి. ఆ తడసిన గింజలను రైతులు కాపాడుకోవటానికి నానా తంటాలు పడవలసి వచ్చింది. ముత్యాలపాడు గ్రామానికి సమీపంలోనే ఉన్న అహోబిళంలోని మఠమోల్ల చెరువు వర్షపు నీటికి నిండి ఆ నీళ్ళు ముత్యాలపాడు చెరువుకు చేరడంతో ముత్యాలపాడు చెరువు నిండి అలుగు ఎక్కి పారడంతో ఆ నీళ్ళు గ్రామంలోని పంటపొలాలలోకిచేరి, గ్రామంలోని మెయిన్ రోడ్డు గుండాఉధృతంగా ప్రవహించి ఎస్పిజి ఉన్నత పాఠశాలలోని ఆవరణంలోకి చెరుకోని సమీపంలోని వాగులోకి ప్రవేశిస్తున్నాయి. ఎస్పిజి ఉన్నతపాఠశాల ఆవరణంలో మొక్కజోన్న గింజలను ఆరబెట్టుకున్న రైతులు అకస్మాత్తుగా వర్షపు నీరు అక్కడి వచ్చి చేరడంతో ఎం చేయాలో దిక్కు తోచక గింలను డోజర్లతోకుప్పచేసి ట్రాక్టర్లతో అక్కడి నుండి రోడ్డుపైకి వర్షార్పణం కావడంతో రైతులు అందోళన చెందుతున్నారు. రైతులు ఖరీఫ్ పంట సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు.కానీ వారి ఆశలు అడి ఆశలయ్యాయి. రైతులు సోమవారం రోజు కురిసిన భారీ వర్షానికి తీవ్ర నష్టాన్ని చివ్వి చూడవలసి వచ్చింది. పంట పోలాలలో నిలిచిన నీరు రోడ్లపైకి వచ్చి పారుతున్నాయి. ఇదీలా ఉంటే మండల కేద్రమైన చాగలమర్రిలోని తహశీల్దార్ కార్యాలయంలోనికి వర్షపు నీరు చేరి కార్యాలయం జలమయమైంది. వర్షపు నీరు కార్యాలయంలోపలికి ప్రవేశించడంతో సిబ్బంది పలు ఇబ్బందులకు గురుయ్యారు. గ్రామంలోని ప్రధాన వీధులైన ముత్యాలపాడు బస్టాండు, గాంధీ సెంటర్, పాత హైవే రోడ్డుపై ఉన్న సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న మురికి కాలువలు నిండి నీరు రోడ్లపై ప్రవహించాయి. కొన్ని వీధులలో వర్షపు నీరు ప్రవహించటానికి మార్గం లేక పోవడంతో మోకాలోతు నీళ్ళు నిలిచి పోవడంతో ప్రజల రాక పోకలకు ఇబ్బంది కలిగింది. ఆ వీధులకు చెందిన ప్రజలు రోడ్లపై నిలిచిన వర్షపు నీరు తరలించటానికి మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కొద్ది పాటి వర్షానికి జలమయం అవుతున్న తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించాలంటే సిబ్బంది ఇబ్బందులకు గురౌతున్నారు. ఎంపీడిఓ కార్యాలయం ప్రక్కనే తహశీల్దారు కార్యాలయం భవనం నిర్మాణం చేపట్టి అర్థాంతరంగా నిలిపి వేసిన ఆ కార్యాలయ భవనాన్ని పూర్తి చేస్తే ఇటు సిబ్బందికి, అటు ప్రజలకు ఇబ్బందులు తోలగుతాయని కోరుతున్నారు. ఇదీలా ఉంటే సోమవారం తెల్లవారుజాము నుండి కూర్చున్న వర్షాలకు మొక్కజొన్న నీటి మునిగిన పంటలను పరిహారం ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.



# దివ్య క్షేత్రంగా..శ్రీశైల మల్లన్న క్షేత్రం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ద్వాదశ జ్యోతిర్లింగం,అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్ర సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్తో దివ్య క్షేత్రంగా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు.సీఎం ఆదేశాలతో సోమవారం దేవదాయ శాఖ మంత్రిఆనంరామనారాయణరెడ్డి అమరావతిలోని సచివాలయంలో అటవీశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జ్యోతిర్లింగం,శక్తిపీఠం కలిగిన పవిత్ర క్షేత్రమైన శ్రీశైలాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు అడుగులు పడ్డాయి.ఏటా లక్షలాది భక్తులు వచ్చే శ్రీశైలంలో భక్తులకు ఉత్తమ సౌకర్యాలు, సదుపాయాలు,మౌలిక వసతులు కల్పించేందుకు సమావేశంలో చర్చించారు.ఆధ్యాత్మిక,పర్యాటక, పర్యావరణ దృక్కోణాల్లో శ్రీశైల ప్రాంత అభివృద్ధి కోసం దేవాదాయ,అటవీ శాఖలు సంయుక్త ప్రణాళికలను రూపొందించనున్నారు.దేవాదాయ శాఖ, అటవీ శాఖ సమన్వయంతో భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి, పర్యాటకులకు సౌకర్య వంతమైన అనుభవం అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.శ్రీశైలం క్షేత్రాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా సమగ్ర అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నట్లు, భవిష్యత్తులో శ్రీసల క్షేత్రం ఎవరి ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని మంత్రి అన్నారు.ఈ దేవాదాయ శాఖ,అటవీ శాఖ ఉన్నతాధికారులతోపాటు శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# టమోటా రైతులకు అండగా ఉంటాం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో:** టమోటా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రకటన విడుదల చేసింది. రాప్తాడు మార్కెట్‌లో టమోటా ధరలు గరిష్టంగా రూ. 18, కనిష్ఠంగా 9 రూపాయలు, మోడల్ ధర రూ.12గా ఉందని ఆయన చెప్పారు. ఇక్కడి నుండి 30 నుండి 40 మెట్రిక్ టన్నుల టమోటా పత్తికొండ మార్కెట్‌కు వస్తోందని, దసరా సెలవుల కారణంగా 10 మెట్రిక్ టన్నులు అదనంగా చేరాయని, దీంతో కొందరు 2వ గ్రేడ్ టమోటాలు రోడ్లపై వేసి గందరగోళం సృష్టించారని వైసీపీని ఆయన పరోక్షంగా విమర్శించారు. పత్తికొండ నుండి టమోటాను రైతు బజార్లకు తరలిస్తున్నామని, అలాగే చిత్తూరు ప్రాసెసింగ్ యూనిట్‌కు 10 మెట్రిక్ టన్నులు పంపించామని, 15 మెట్రిక్ టన్నులను రైతుబజార్లకు పంపించామని ఆయన చెప్పారు. కర్నాటక, తెలంగాణా, మహారాష్ట్ర రాష్ట్రాలకు వర్షాల కారణంగా టమోటాను ఎగుమతి చేయలేని పరిస్థితులున్నాయని, అందుకే ధరలు మందగించాయని చెప్పారు. ప్రస్తుతం టమోటా రైతులకు ట్రెండింగ్ ధర బట్టి మంచి ధర లభిస్తోందని ఆయన వివరించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# తగ్గించిన జీఎస్టీతో ప్రజలకు లబ్ధి

(మొదటి పేజీ తరువాయి)

మరియు షాపింగ్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన కార్, ట్రాక్టర్ ,మోటార్ సైకిల్ , స్కూటీ, ఔషధ స్టాల్ , బుక్ స్టాల్ , ఎలక్ట్రానిక్ గూడ్స్, టూత్ పేస్ట్ ,బ్రష్ ,షాంపు ఆయిల్ స్టాల్స్ ను పరిశీలించచారు. జీఎస్టీ తగ్గింపు పై పూర్తి అవగాహన ప్రజలు కలిగి ఉండాలన్నది ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని జీఎస్టీ తగ్గించని దుకాణదారులకు పై ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవ సమావేశానికి కమర్షియల్ శాఖ జాయింట్ కమిషనర్ నీరజ , జిల్లా సివిల్ సప్లై అధికారి రాజా రఘువీర్ , సివిల్ సప్లై జిల్లా మేనేజర్ వెంకట రాముడు ,ఎస్ఏపీ క్యాంపు డీఎస్పీ మహబూబ్ బాషా, అపోలో మెడికల్ సిబ్బంది ,ట్రాక్టర్ ,కార్ ,మోటార్ సైకిల్ షోరూం ప్రతినిధులు , బుక్ స్టాల్, వివిధ వ్యాపారస్తుల యాజమాన్యాలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఎ) డా. రఘునందన్ అన్నారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని వివిధ విభాగాల హెచ్‌ఓడిలతో సమావేశం నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పేషెంట్లకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్లకు నాణ్యమైన సమయపాలనతో కూడిన సేవలు అందించడంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. బాధ్యతతో సేవాభావంతో పనిచేయాలని సూచించారు. వైద్యులు పేషెంట్లకు సేవ చేస్తున్నా దానిని ప్రజెంటేషన్ చేయలేకపోతున్నారని అన్నారు. ప్రతి కేసుకు ఆయుష్మాన్ భారత్ ఐడి నమోదు పూర్తి స్థాయిలో చేయడం లేదని దీని వల్ల చేసిన పని కూడా సాంకేతికంగా చూపించలేకపోతున్నామని ఆయన అన్నారు. అనంతరం రఘునందన్‌ను సన్మానించారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, కెఎంసి ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్‌డా. సాయి సుధీర్, డా. సింధ్య, డా. హరిచరణ్, సిఎస్ఆర్‌ఎంఓ డా. వెంకట రమణ పాల్గొన్నారు.

# అనారోగ్యంతో సీఐ మృతి



**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** నంద్యాల ఎస్ బి సీఐగా విధులు నిర్వహిస్తున్న సిఐ ఐ జాన్సన్ బాబురావు( 58) అనారోగ్యం కారణంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని చాణక్యపురి కాలనీలో జాన్సన్ బాబు రావు నివాసం ఉంటున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడేవాడనీ, సోమవారం విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. 2002 బ్యాచ్ కి చెందిన జాన్సన్ బాబు కర్నూలు జిల్లాలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయన కర్నూలు జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లో ఎస్సైగా, సీఐ గా విధులు నిర్వహించారు. సీఐ జాన్సన్ బాబు మృతి చెందడంతో తోటి పోలీస్ ఉద్యోగులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మట్టి మిద్దె కూలి బాలిక మృతి

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు
- కన్నీరు మున్నీరుగా తల్లిదండ్రుల రోదనలు
- న్యాయం చేయాలని వినతి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** అభం శుభం తెలియని బాలిక మట్టి మిద్దె కూలి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకొంది. మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఎస్.ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోనెగండ్ల మండలం గంజళ్ల గ్రామానికి చెందిన రామాంజనేయులు మహేశ్వరి దంపతుల కూతురు లలిత (5) అనే బాలిక మాధవరం గ్రామంలో తమ తాతగారైన నాగలదిన్నె భీమయ్య ఇంట్లో ఉండేది. ప్రక్క గ్రామంలో ఉన్న రచ్చుమర్రిలో ఓ ప్రైవేట్ పాఠశాలలో నర్సరీ చదువుకుంటుంది. భారీ వర్షాల కారణంగా ఆదివారం రాత్రి మట్టి మిద్దె కూలింది. అందులో చిక్కుకున్న లలిత కొన ఊపిరితో ఉన్నట్లు తెలిపారు. బయటకు తీసిన వెంటనే మృతి చెందింది. తమ



మృతి చెందిన చిన్నారి లలిత



కూలిన మట్టిమిద్దె

కూతురు చూపి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూసి పలువురిని కంటతడి పెట్టించింది. మిగతా వారికి గాయాలు తగిలాయి. మట్టి మిద్దె ఇంట్లో సరుకులు, బట్టలు మట్టి పాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే గొర్రె కూడ మృతి చెందినట్లు తె లిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే తహశీల్దార్ రమాదేవి ఆదేశాల మేరకు ఆర్.ఐ జనార్ధన్ రావు సంఘటన స్థలాన్ని పరిశీలించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. మట్టిమిద్దె కూలిపోవడంతో నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

# గ్యాస్ లీకేజీ..చెలరేగిన మంటలు

- నలుగురు కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** గ్యాస్ లీకేజి అయ్యి, చెలరేగిన మంటలలో నలుగురు కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం మండల పరిధిలోని బోయినపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే గ్రామానికి చెందిన వడ్డె నాగరాజు, భార్య సువర్ణ(ఆరు నెలల గర్భిణీ), కుమారులు అనీల్, చరణ్‌లతో కలిసి ఇంటిలో ఆదివారం నిద్రిస్తుండగా సోమవారం అర్ధరాత్రి 1:00 గంట సమయంలో గ్యాస్ లీకేజి అయ్యి భారీ పేలుడుతో మంటలు చెలరేగాయి. పేలుడు శబ్దం విన్న చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే ఇంటి తలుపు విరిగిపోయి, అందులో నుండి పదేళ్ళ వయస్సున్న అనీల్, 4ఏళ్ళ వయస్సున్న చరణ్‌లు మంటలతో బయటకు రావడాన్ని స్థానికులు గమనించారు. హుటాహుటీన చిన్నారులకు అంటుకున్న మంటలను ఆర్పివేసి, ఇంటి లోపల మంట్లో చిక్కుకున్న వడ్డె నాగరాజు, అతని భార్య సువర్ణలను



స్థానికులు రక్షించారు. గ్యాస్ స్టవ్ వద్దనో లేక గ్యాస్ సిలిండర్ వద్దనో సరిగ్గా స్విచ్ఛ్ ఆఫ్ చేయకపోవడంతో, గ్యాస్ మొత్తం లీకై, 1:00 గంట సమయంలో వడ్డె నాగరాజు నిద్రలేచి లైట్ వేయడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు ప్రాథమికంగా అంచనా వేశారు. పేలుడు ధాటికి ఇంటి గోడలు బీటలు బారి, తలుపులు విరిగిపడి, ఇంటిలోని వస్తువులు చిందరవందరంగా పడిపోయాయి. తీవ్రంగా గాయపడిన కుటుంబ సభ్యులను కృష్ణగిరి 108 అంబులెన్స్‌లో వెల్దుర్తి సిహెచ్‌సి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వెల్దుర్తి పోలీసులు విచారణ చేస్తున్నారు. సంఘటన పట్ల గ్రామానికి చెందిన పెద్దలు గ్రామ నాయకుడు నర్సింగ్ కాంతారెడ్డి, వైయస్ఆర్‌సిపి యువజన విభాగం రాష్ట్ర నాయకుడు నర్సింగ్ అశోక్ కుమార్‌రెడ్డి, జడ్పిటిసి సభ్యుడు దాదిపోగు సుంకన్నలు విచారం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, అదేవిధంగా ఇండెన్ గ్యాస్ కంపెనీ వారు కూడా బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ప్రజలు కోరారు.

# పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 60 ఫిర్యాదులు




ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్** : నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవాం పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు ఫిర్యాదుదారుల నుంచి 60 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. చట్ట పరిధిలో చట్ట పరంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కారం చూపాలని నిర్ణీత గడవులోపు పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేయడం, భూ తగాదాలు, ఆస్తి వివాదాలు, తదితర ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షులు గుడిపల్లి సురేందర్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షులు గుడిపల్లి సురేందర్ అన్నారు. జిల్లా ఎస్జీఎఫ్ ఆద్వర్యంలో సోమవారం జరిగిన రగ్బీ జిల్లా జట్ల ఎంపిక పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరక శ్రమ కలిగిన క్రీడలలో సాధన చేస్తూ తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన మూడు శాతం క్రీడా రిజర్వేషన్ కోటాలో చాలామందికి ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నారు. జిల్లాలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మంత్రి టీజీ భరత్ సహకారంతో రగ్బీ క్రీడను అభివృద్ధిపరిచినట్లు ఆయన గుర్తు చేశారు. మొబైల్ ఫోన్ దూరంగా ఉంచి ప్రతిరోజు తమకు నచ్చిన శారీరక శ్రమ కలిగిన క్రీడలను సాధన చేయాలని కోరారు. ప్రపంచంలో అత్యధిక యువకులు కలిగిన దేశంగా భారతదేశం పేరుగాంచిందని 51శాతం మంది యువకులు ఉన్న భారతదేశాన్ని యువభారత్‌గా ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ తల్లిదండ్రుల ఆశయ సాధన కొరకు కృషి చేయాలని కోరారు. జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి టి కృష్ణ మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖ ఆద్వర్యంలో జరుగుతున్న ఈ క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లాల నుండి 350మంది క్రీడాకారుల హాజరైనట్లు తెలిపారు. క్రీడాకారులు తమ పూర్తి నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా జట్టుకు ఎంపికయ్యేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో రగ్బీ అభివృద్ధి కొరకు టీజీ వెంకటేష్ సహకారంతో విదేశీ క్రీడా శిక్షకులను పిలిపించి దాదాపు 3వేల మంది విద్యార్థులకు రగ్బీ క్రీడలో తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షులు సురేందర్, టి కృష్ణ, రామాంజనేయులు, జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులందరూ క్రీడాకారులను పరిచయం చేసుకుని జిల్లా జట్ల ఎంపిక పోటీలను ప్రారంభించారు.

# ప్రజల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

- టీడీపీ అధికార ప్రతినిధి గిరీశ్వర్‌రెడ్డి

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వర్‌రెడ్డి అన్నారు. మండలం లోని తరిగోపుల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీని టీడీపీ అధికార ప్రతినిధి గిరీశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, సర్పంచ్ అంజనమ్మ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మిలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఏ నెలలో రాష్ట్ర ప్రభుత్వం తనకు ఏమేమి సరుకులు అందిస్తుంది, లబ్ధిదారులు ఏ నెలలో ఏ సరుకులు తీసుకున్నారనేది తెలుసుకోవచ్చునని, ఈ స్మార్ట్ కార్డును గుర్తింపు కార్డుగా కూడా ఉపయోగించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగార్జునరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

# అధికారుల ఒత్తిడికిలోనై రోగాల బారిన పడుతున్నాం

ః- సమయం కేటాయిస్తే పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాం ః- మున్సిపల్ ఉద్యోగులు

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ ః** నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు అధికారుల ఒత్తిడికి తట్టుకోలేక రోగాల బారిన పడుతున్నామని మున్సిపల్ సుపీరియర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ విశ్వనాథ్‌కు సుపీరియర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు శ్రీకాంత్, పరుశురాముడు, రామకృష్ణ, అబ్దుల్ వాజిద్, రాజు భాస్కర్ రెడ్డిలతో పాటు మరో 15మంది ఉద్యోగులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచేందుకు తమవంతుగా పాటుపడుతూనే ఉన్నామన్నారు. మీరు వచ్చిన తర్వాత వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాలు ఏర్పాటు చేయడంతో సమయం ఎక్కువగా వృధా అవుతుందని తమకు కేటాయించిన పనులను చేయలేకపోతున్నామని దానికి మీరు మెమోలు ఇవ్వడం వల్ల బిపి, షుగర్‌లు పెరిగి రోగాల బారిన పడుతున్నామని, కొంత సమయం ఇస్తే మీతో పాటు కర్నూలు నగరపాలక సంస్థ అభివృద్ధి కృషి చేస్తామన్నారు.

# రక్తదాత మద్దిలేటికి సిపిఐ ఘన సన్మానం

**కోడుమూరు, మేజర్ న్యూస్ ః** రక్తదాత సిరిగిరి మద్దిలేటిని సిపిఐ పార్టీ పట్టణ సమితి ఘనంగా సన్మానించింది. సోమవారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి శేషు కుమార్ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో సిపిఐ మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి శేషుకుమార్‌లు మాట్లాడుతూ కోడుమూరు పట్టణవాసి అయిన సిరిగిరి మద్దిలేటి రాష్ట్రం, జిల్లాలో ఎక్కడ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి, గర్భిణి స్త్రీలు, తలసేమియా, ఆపరేషన్ రోగులకు తాను రక్తదానం చేయడమే కాకుండా తన బంధువులను, మిత్రులను రక్తదానానికి ప్రోత్సహించారన్నారు. సిపిఐ నాయకులు దుశ్శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్న రాముడు, సిపిఐ నాయకులు బాబురావు, కృష్ణ, తిమ్మప్ప, ఆటో యూనియన్ నాయకులు మధు, హమాలీ సంఘం నాయకులు బజారి తదితరులు పాల్గొన్నారు.




# మీడియా ముసుగులో ఉద్యోగులపై వేధింపులు

- బ్లాక్ మెయిల్ జర్నలిజం సిగ్గు చేటు - మహిళలను అడ్డం పెట్టుకొని..

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వానికి, ప్రజలకు వారధులైన పాత్రికేయులపై ప్రజా సంఘాలకు ఎంతో గౌరవం ఉందని ఎంఆర్‌పీఎస్ ప్రజా సంఘాల నాయకులు కళ్యాణ్ మాదిగ, బాలచంద్రుడు, బెనర్జి అన్నారు. మీడియా ముసుగులో ఉద్యోగులను వేధింపులకు గురి చేయడం సమంజసం కాదని అన్నారు. బ్లాక్ మెయిల్ జర్నలిజం సిగ్గు చేటని అన్నారు. సోమవారం బొమ్మలసత్రం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి ఎస్పీ బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజాసంఘాలు, ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలోని పాత్రికేయులు శరత్‌బాబు, విజయ్‌లు మహిళలను అడ్డం పెట్టుకొని ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఇద్దరు మహిళలను పావుగా ఉపయోగించుకొని త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడుపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అసత్య కథనాలను అందిస్తున్నారని అన్నారు. గతంలో జరిగిన చిన్న అంశాన్ని బూతద్దంలో చూపిస్తూ అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. పట్టణంలో అనేక బ్లాక్ మెయిల్ సంఘటనల్లో భాగస్వామి అయిన మహిళ చేత సీఐకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో మెసేజ్‌లు చేయించి తిరిగి బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. సీఐ ఎక్కడ పని చేసినా మంచి పేరు సంపాదించుకున్న విషయం అందరికీ తెలుసునని అన్నారు. గతంలో జరిగిన ఘటనలను ఇప్పుడు తెరపైకి తేవడంలో ఆతర్యమేమిటని ప్రశ్నించారు. చివరిలో ఇందుకు బాధ్యులైన పాత్రికేయులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సూర్య



# రైతులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవట్లేదు..

- రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల భరత్ కుమార్ రెడ్డి
- ఆదోని పత్తి మార్కెట్ యార్డులో వైసీపీ రైతు విభాగం ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి
- నష్టాలలో కూరుకుపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్



**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతన్నలను ఏమాత్రం పట్టించుకోవట్లేదు' అని రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవిచంద్రారెడ్డిలు విమర్శించారు. వైయస్సార్సీపి రైతు విభాగం ఆధ్వర్యంలో ఆదోని ప్రత్తి మార్కెట్ యార్డులో సోమవారం వారు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటానికు రూ.8110 ఉంటే మార్కెట్లో కేవలం రూ.3వేలు నుంచి రూ. 6వేలు వరకు ధర పలుకుతున్నా ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తుందని మండిపడ్డారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు సగం పంట చేలోనే కుళ్లిపోయిందని, చేతికొచ్చిన సగం పంటకు సరైన ధర కూడా రావట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పొలం నుంచి ప్రత్తిని తీసి మార్కెట్ కు తరలించడానికే ఒక కేజీకి రూ. 25 ఖర్చు అవుతుందని గుర్తు చేశారు. అయితే ధర మాత్రం ఒక కేజీ ప్రత్తికి రూ.50లు ధర మాత్రమే ఉంటుందన్నారు. పంటకు పెట్టిన పెట్టుబడి అప్పులు తీర్చలేక రైతులు అల్లాడిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చీమ కుట్టినట్లయినా లేదని దుయ్యబట్టారు. అదేవిధంగా ఈ ఏడాది వేసిన మొదటి పంట ఉల్లి ధరలు పతనం కావడంతో రైతులు పంటను పొలంలోనే వదిలేస్తున్నారని తెలిపారు. క్వింటానికి రూ.1200లకు కొంటామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అరకొరగా కొనేసి గొప్పలు చెప్పుకుంటుందన్నారు. ఎకరాకు ఇరవై వేలు ఇస్తామని చేతులు దులుపుకుని ఇంతవరకు కొన్న వాటికి డబ్బులు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిచి పత్తి కొనుగోలు చేయాలని అలాగే పత్తి రైతుకు కూడా ఎకరాకు రూ. 20వేలు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు రాజధాని భవనాల మీద ఉన్నంత శ్రద్ధ రైతన్నల మీద ఏమాత్రం లేదన్నారు. నష్టాల్లో కూరుకుపోయిన రైతంగాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ గురునాథ్ రెడ్డి, రైతు విభాగం ఆదోని అధ్యక్షుడు గొల్ల వీరేశ్, సీనియర్ నాయకుడు వెంకటేష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలి

### – జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ నెల 16న కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్నందున ప్రతిఒక్కరు విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక వ్యాస్ ఆడిటోరియంలో ప్రధానమంత్రి భద్రత ఏర్పాట్లపై జిల్లా లైజెనింగ్, సెక్టార్ లైజెనింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీస్ అధికారులు భద్రతా పరంగా పకడ్బందీ ఏర్పాట్లు, బందోబస్తు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రధాన పర్యటన నిమిత్తం విఐపిలు డిజిపి, ఐజి, డిఐజి, ఐపిఎస్ అధికారులు జిల్లాకు వస్తుంటారని విధుల పట్ల బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాకు 6వేల మంది ఫోర్స్ రావచ్చని, 13వ తేదీన ఫోర్స్ రిపోర్టు చేసుకుంటారని, 14న ట్రైల్ రన్ నిర్వహిస్తారన్నారు. బస్సుల్లో ప్రజలు నన్నూరు టోల్ ప్లాజా దగ్గరున్న రాగమయూరిలో ఏర్పాటు చేసే ప్రధానమంత్రి బహిరంగ సభకు వస్తారన్నారు. బస్సు రూట్‌లలో రోడ్డు సరిగా లేని చోట గుర్తించాలన్నారు. ప్రమాదాలు జరుగకుండా సరి చేయించాలన్నారు. నేడు మంగళవారం డిజిపి హరీష్ కుమార్ గుప్తా జిల్లాకు చేరుకుంటారని బుధవారం ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తారన్నారు. అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డిఎస్పీలు, సిఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

### ఎగువ అహోబిలంలో మహా పూర్ణాహుతితో

# ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు





**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ మండలం ఎగువ అహోబిలం క్షేత్రంలో ఈనెల 2 నుండి ప్రారంభమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి పవిత్రోత్సవ కార్యక్రమాలు సోమవారం మహా పూర్ణాహుతి కార్యక్రమంతో వైభవంగా ముగిసాయి. ఎగువ అహోబిలం ఉత్సవమూర్తి మీ జ్వాల నరసింహస్వామి, శ్రీ చెంచులక్ష్మి , శ్రీదేవి భూదేవి అమ్మవార్ల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని పట్టు పవిత్ర మాలలతో అలంకరించి హెూమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీ వన్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి స్వీయ పర్యవేక్షణలో ఈ ఏడాది పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా ముగిసినట్లు దేవస్థానం ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి తెలిపారు. చెన్నై, కాంచీపురం తదితర ప్రాంతాల నుండి వచ్చిన వేద పండితులు వేద గోష్టి కార్యక్రమాలలో పాల్గొనడం జరిగిందని వివరించారు.

# ఉమామహేశ్వరులను దర్శించుకున్న దక్షిణ కొరియా దేశస్తులు

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్:** ఎర్రమల్ల కొండల్లో వెలిసిన యాగంటి శ్రీ ఉమామహేశ్వరులను సోమవారంనాడు దక్షిణకొరియా దేశస్థులు భారతదేశ పర్యటనలో భాగంగా పలు ప్రదేశాలను దర్శించుకుంటూ యాగంటి శ్రీ ఉమామహేశ్వరులను దర్శించుకోవడం జరిగింది. **ఆలయ అభివృద్ధికి విరాళం :** నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారి కుటుంబ సభ్యులు ఉమామహేశ్వరుల ఆలయ అభివృద్ధికి రూ.10వేలు విరాళాన్ని అందజేశారు. ఆలయ అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



యాగంటిక్షేత్రంలో దక్షిణకొరియా దేశస్థులు

# చేయి చేయి కలుపుదాం.. స్వచ్ఛాంధ్ర సాధిద్దాం

### – మంత్రి టీజీ భరత్



అవార్డు గ్రహీతలతో మంత్రి టీజీ భరత్, జెసి నవ్య

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తేనే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల జపాన్ పర్యటనలో భాగంగా అక్కడ చెత్తను వేర్వేరు చేసి ఆదాయంగా మార్చే విధంగా నిర్వహించడం ద్వారా పరిశుభ్రతను ఎలా కాపాడుతున్నారో వివరించారు. అక్కడ వృత్తిపరమైన చెత్త బుట్టలు మాత్రమే ఉంటాయని, ప్రజలు చెత్తను ఎక్కడ వేయాలో తెలుసుకుని తగిన ప్రదేశంలో వేరు చేసి ఉంచుతారన్నారు. వీలైనంత వరకు చెత్తను వ్యర్థంగా చూడకుండా నూతన ఉత్పత్తులకు ఉపయోగించేలా మారుస్తారని, ఈ విధానం పరిశుభ్రతను కాపాడటానికి 30ళ్లు పట్టిందని మంత్రి వివరించారు. నగరంలో వర్షాకాలంలో కాలువలు నిండే ప్రధాన కారణం మన ఇంటి చెత్తను కాలువల్లో వేయడం అని గుర్తు చేశారు. ప్రజలు, ప్రతినిధులు, అధికారులు కలిసి కృషి చేస్తే నగరాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చన్నారు. అవార్డులు పొందిన వారిని ప్రేరణగా తీసుకుని మరింత కృషి చేయాలన్నారు. జెసి డా.బి నవ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిశుభ్రతకు ప్రత్యేక దృష్టి పెట్టి చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా వేర్వేరు చేసి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీ, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ స్లామ్ ఫెడరేషన్, స్వచ్ఛ రైతు బజార్, స్వచ్ఛ బస్‌స్టేషన్, స్వచ్ఛ ఎన్‌జిఓలు, ఆసుపత్రులు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు, పరిశ్రమలు, పారిశుద్ధ్య కార్మికులకు అవార్డులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ నాసరరెడ్డి, ఐసిడిఎస్ పిడి విజయ, అదనపు మున్సిపల్ కమీషనర్ కృష్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సభ ఏర్పాట్ల స్థలాన్ని పరిశీలించిన మంత్రులు అధికారులు



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ కర్నూలు జిల్లాలో పర్యటించిన సందర్భంగా మండల పరిధిలోని నన్నూరు గ్రామ పరిధిలోని టోల్‌గేట్, రాగమయూరి, గుట్టపాడు గ్రామాల వద్ద సభ ఏర్పాట్లకు స్థలాన్ని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, ప్రధానమంత్రి కార్యక్రమాల స్పెషల్ కోఆర్డినేటర్ వీరపాండియన్, ఎమ్మెల్సీలు, ఎంపిలు, కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, ఇతర ప్రతినిధులు కలిసి పరిశీలించారు.

# అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- 17వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన అంధులకు పింఛన్లు పంపిణీ
- సొంత నిధులతో 16 సంవత్సరాలుగా పింఛన్‌లను అందజేస్తున్న బి.సి రాజారెడ్డి
- ప్రతి నెల రూ.700 లు పింఛన్



**బనగానపల్లెమేజర్,న్యూస్ :** అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి అన్నారు. సోమవారంనాడు స్థానిక బి.సి గుర్రెడ్డి కాలనీలో అంధులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి 200 రూపాయల చొప్పున 200 మందికి బి.సి రాజారెడ్డి సొంత డబ్బుతో ఫించన్‌లను పంపిణీ చేశారు. ముందుగా కీ.శే. బి.సి గుర్రెడ్డి, బి.సి లక్ష్మమ్మ దంపతులు, కీ.శే. బి.సి బాల తిమ్మారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బి.సి రాజారెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 2009 అక్టోబరులో అంధులకు ఫించన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని 16సంవత్సరాలుగా ప్రతి నెల 1వ తేదీన సొంత డబ్బుతో వారికి ఫించన్‌లను అందిస్తున్నామన్నారు. నేటితో 17వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామని అందులో భాగంగా 500 రూపాయల చొప్పున అందించే ఫించన్‌ను 700 రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. దివ్యాంగులపట్ల గౌరవంగా మెలగాలని వారికి మంచి చేయకపోయినా పర్వాలేదు కానీ చెడు చేయకూడదన్నారు. అంధుల మనోధైర్యంతో ఉన్నత విద్యను అభ్యశించి ఉద్యోగ అవకాశాలు పొందాలని తెలిపారు. కడప జిల్లాకు చెందిన బూడిద శ్రీనివాస రెడ్డి మహారాష్ట్రలోని ఉల్లాస నగరానికి చెందిన ట్రాంజల్ అనే మహిళ తూర్పు గోదావరి జిల్లా గుండవల్లి గ్రామానికి చెందిన కట్టా సింహాచలం అంధులైనప్పటికీ పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఐ.ఎ.ఎస్‌లు అయ్యారని తెలిపారు. హైదరాబాదుకు చెందిన గొల్ల శ్రీకాంత్ అంధుడై హైదరబాద్‌లో ఐఐటిలో సీటు నిరాకరిస్తే అమెరికాలో సీటు సాధించారని నేడు 300కోట్ల వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడని అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాల్లో తమ సోదరుల సహకారం మరువలేనిదన్నారు. ప్రముఖ గజల్ గాయకుడు మహమ్మద్ మియా తన పాటలతో అందరిని అలరించారు. అనంతరం అంధులకు వారితోపాటు వచ్చిన సహాయకులకు భోజన వసతి కల్పించి బి.సి రాజారెడ్డి వడ్డించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు కమిటీ ఛైర్మెన్ కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, బొబ్బల మహేశ్వర రెడ్డి, రోటరీక్లబ్ మెంబర్ బలరామయ్య పాల్గొన్నారు.

# స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి




**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లాను శుభ్రంగా సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం పిజిఆర్‌ఎస్ హాల్‌లో స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2025 జిల్లాస్థాయి బహుమతుల ప్రధాన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిపిఓ లలితాబాయి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డోన్ మున్సిపల్ చైర్మన్ రాజేష్, నంద్యాల ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజకుమారి మాట్లాడుతూ రాబోయే మూడు నెలల్లో నంద్యాల జిల్లాలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరు చురుకుగా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాని తీర్మానించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార ప్రదేశాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని క్రమంగా అమలుచేసి తరువాత దాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని రెండో తీర్మాణంగా నిర్ణయించారు. ద్రవ, ఘన వ్యర్థాలను వేరుగా వర్గీకరించేందుకు శ్రీకారం చుట్టాలని మూడవ తీర్మాణంగా నిర్ణయించారు. జిల్లాలోని మెప్మా, డీఆర్‌డిఎ ఆధ్వర్యంలోని మహిళా స్వచ్ఛంద సమూహాల ద్వారా ఇంట్లోనే చెత్తతో కంపోస్ట్ తయారీని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని నాలుగో తీర్మానం, నీటిమట్టాలు తగ్గిపోయిన 165 గ్రామాల్లో భూగర్భ జలాలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక రీచార్జ్ నిర్మాణాలు చేపట్టాలని ఐదవ తీర్మాణంగా సూచించారు. నంద్యాల జిల్లాలో 24 పర్యాటక కేంద్రాలు ఉన్నందున వాటిని పరిశుభ్రంగా ఉంచి పర్యాటకులకు ఆహ్లాదకర అనుభవం కలిగించేందుకు కృషి చేయాలని చెప్పారు. స్మశాన వాటికల అభివృద్ధికి, వాటికి సరైన రహదరులు ఏర్పాటుకు కూడా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2025లో రాష్ట్రస్థాయిలో మన ఊరు మనగుడి మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ అవార్డు లభించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వివిధ విభాగాల్లో మొత్తం 51 అవార్డులు సాధించిన నిర్వాహకులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెమోంటోలు, సర్టిఫికెట్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేసి వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వచ్ఛంధ్ర సాధన కోసం కృషి చేసిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందజేస్తున్న రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2025 ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని వీక్షించారు.

# అర్జీలను నాణ్యతతో గడువులోపు పరిష్కరించాలి – జెసి.నవ్య



**కర్నూలు, మేజర్‌న్యూస్ :** అర్జీదారుల నుండి వచ్చిన అర్జీలను నాణ్యతతో నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయాన ఆడిటోరియంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జెసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటి పరిష్కారంపై అధికారులు కఠినమైన సూచనలు అందించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి, లాగిన్‌లో వచ్చిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండ పర్యవేక్షించాలని, సిఎం కార్యాలయానికి సంబంధించిన పెండింగ్ ఫిర్యాదులను బియాండ్ ఎస్ఎల్‌లోకి వెళ్లకుండా తక్షణమే పరిష్కరించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీతకాల పరిమితిలోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలె క్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాల్‌లో డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన ప్రతి అర్జీని జాగ్రతగా చదివి అందులో పేర్కొన్న అంశాలను పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. అన్ని సంక్షేమ హాస్టళ్లు, స్త్రీ శిశు సంరక్షణ కేంద్రాల్లో మౌళిక సదుపాయాల కల్పనపై సంబంధిత క్షేత్ర అధికారులు తనిఖీలు నిర్వహించి సంబంధిత ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం 222మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు.




# శ్రీశ్రీశ్రీ హజరత్ పెద్దదస్తగిరి స్వామి దర్గ ఉరుసు మహోత్సవం



**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీలోని 2వ వార్డు నందు వెలసిన శ్రీశ్రీశ్రీ హజరత్ పెద్దదస్తగిరి స్వామి దర్గా వారి ఉరుసు మహోత్సవాన్ని ఈనెల 4, 8, 9వ తేదిలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్వామి వారి భక్త బృందం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7వ తేది మంగళవారం గంధం, 8వ తేది బుధవారం ఉరుసు, 9వ తేది గురువారం కిస్తీల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున భక్తులు ఉరుసు మహోత్సవంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొంది, తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. అలాగే 8వ తేది బుధవారం మద్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు తెలిపారు. అలాగే అదేరోజు రాత్రి 8:30 గంటలకు చెక్కభజన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

# నెరణికి గ్రామానికి చేరిన మాళమల్లేశ్వరస్వామి విగ్రహామూర్తులు

**– నెరణికిలో పండుగ వాతవరణం..వైభవంగా ముగిసిన దేవరగట్టు ఉత్సవాలు**



**హొళగుంద,మేజర్‌న్యూస్ :** దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి విగ్రహామూర్తులు,పల్లకి సోమవారం నెరణికి గ్రామానికి చేరాయి.దింతో దేవరగట్టు విజయదమి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి.సెప్టెంబర్ 27వ తేదిన కంకణధారణతో ప్రారంభం అయిన ఉత్సవా లు సోమవారం స్వామి వారి విగ్రహా మూర్తులను పల్లకిలను గ్రామ భక్తులు నెరణికికి చేర్చడంతో ఉత్సవాలు ముగిశాయి.కాన్సిటేబుల్ పెద్దన్న స్వామి వారి పల్లకిని మోసుకోస్తు తన భక్తిని చాటుకన్నారు.విగ్రహామూర్తులు గ్రామానికి చేరడంతో గ్రామంలో పెద్ద పండగ వాతవరణం నెలకొంది.ఇంటిల్లి పాదిగా తీపి పదార్థలను చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.డోళ్ళు,మేళాతాళాలతో గ్రామంలోని పిల్లల నుండి పెద్దల వరకు ఉల్లాసంగా డుర్ర్..ర్ర్ గోఫరాక్ అంటు కేకలు వేస్తు చిందులు వేశారు.దేవరగట్టు విజయదశమి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం కర్రల ఉత్సవంలో ఈ సారీ హింస చోటు చేసుకుంది,మహా రథోత్సవం,గొరవయ్యల నృత్యాలు,ఇనుప గొలుసు త్రెంచుట కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో గ్రామ భక్తులు పాల్గొన్నారులు పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

# సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్‌పై ప్రచారం



మాట్లాడుతున్న సెట్కూరు సిఈఓ

**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ :** సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సెట్కూ రు సిఈఓ వేణుగోపా ల్, స్టేట్ జిఎస్‌టి డిప్యూటీ కమీషనర్ నిర్మల, ఇంచార్జ్ ఎంపిడిఓ వెంకట రమణలు సోమవారం ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని సోమయాజుల పల్లెలో బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయంలో సెలూన్ల వినియోగదారులకు నూతన జిఎస్‌టి స్లాబులపై అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య భీమా వ్యక్తిగత భీమాలపై జిఎస్‌టి ఉండదని యోగా, జిమ్ సెంటర్‌లో చెల్లించే రుసుములు క్రీడా సామాగ్రిపై జిఎస్‌టిని 18శాతం నుండి ఐదు శాతానికి తగ్గించారని ఈ జిఎస్‌టిలో తగ్గింపుతో వినియోగదారులకు డబ్బు ఆదా అవుతుందన్నారు. అనంతరం జిఎస్‌టి స్లాబులపై ప్రజలకు అవగాహన చేస్తూ కపత్రాలు పంపిణీ చేశారు. తదనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతి, బీసిహెచ్‌ఎస్ డాక్టర్ జఫుల్లా, గ్రామ సర్పంచ్ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, పాలకొలను పంచాయతీ కార్యదర్శి రవికుమార్, కాల్వ పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీ, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి బి.సి



**బనగానపల్లెమేజర్,న్యూస్ :** ఈ నెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ పర్యటించనున్న నేపథ్యంలో సన్నాహాక ఏర్పాట్లపై కర్నూలు స్టేట్ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రులు బి.సి జనార్ధన్ రెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, టి.జి భరత్, కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూటమి పార్టీ నేతల మధ్య ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది.

పోటీ పరీక్షల ప్రత్యేకం

# మొగలులు దురాక్రమణ దారులా...?

**ఎన్నడూ లేని విధంగా ఈ రోజున మొగలుల పాత్ర్యాంశం వివాదాస్పదమవుతోంది. దీనికి కారణాలు రెండు. ఒకటి మొగలులు విదేశీయులు, రెండు దురాక్రమణ దారులు అన్న విషయం. మనదేశాన్ని మొగలులు 350 సంవత్సరాలకి పైగా పాలించారు. ఇహ వీరి పాలన వల్ల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో పలు మార్పులు సంభవించాయి. అయితే మొదటిగా మొగలులు విదేశీయులు అన్న వాదం చూద్దాము. కొద్దిగా చరిత్ర మూలల నుండి వద్దాం.**


భూమి అనేది ఒక గ్రహం. ఈ గ్రహం పైన ఆదిమానవుడు ఆఫ్రికా ఖండంలో ఉదయించాడు. అక్కడనుండి మనిషి అనేక ఖండాలకు సంవత్సరాల తరబడి ప్రయాణం చేసి విస్తరించాడు. ఇలా మన దేశానికి వలస వచ్చిన ఆదిమానవుడు కాల గమనంలో స్థిర వ్యవసాయం, పశుపోషణ, సముద్ర వ్యాపారం, పత్తి పండించడం, అమ్మ తల్లిని, శివుడిని కొలవడం జరిగినది. వీరు ద్రవిడులుగా పిలవబడి నారు. ప్రపంచంలో మొట్టమొదటి పట్టణ నాగరి కలైన సింధు నాగరికత నిర్మాతలు ద్రవిడులే. మన ద్రవిడులకు ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చిన మూలాలున్నాయి కనుక మనదేశానికి మూల వాసులు ద్రవిడులు. తెలుగు, తమిళం, మళయాళం, కన్నడ, తుళు భాషలు మాట్లాడుతున్న దక్షిణ భారతీయులే ద్రవిడులు.

ద్రవిడుల అనంతరం మధ్యాసియా ముఖ్యంగా ఇరాన్ లేదా పర్షియా నుండి ఆర్యులు (మాక్స్‌ముల్లర్ సిద్దాంతం) వచ్చారు. ఈ సిద్ధాంతాన్ని ప్రాచీన భోగజ్ కోయీ శాసనం చెపుతుంది. వివిధ ఆర్యగణాల మధ్య పచ్చిక బయళ్ళ కొరకు జరిగిన దశరాజు గణ యుద్ధాన్ని ఆపడానికి బ్రహ్మదేవుడు హిటైట్, మిటాన్ని భాషల్లో భోగజ్ కోయీ శాసనం వేయడం జరిగినది. తదనంతరము ఆర్యులు తొలివేద, మలివేద పేరిట విస్తరించి జనపదాలకి శ్రీకారం చుట్టారు. క్రమేపీ ఆర్యులు శ్రీరామ చంద్రు డిని కొలవడం, యజ్ఞాలకి ప్రాధాన్యం ఇవ్వటం జరిగింది. ఆర్యులు వచ్చిన మధ్య ఆసియా నుండే చాలా సంవత్సరాల తరువాత కుతుబ్‌షాహీలు వచ్చి గోల్కొండలో రాజ్యం పెట్టారు. (1512-18)దీనిని బట్టి ఆర్యుల, కుతుబ్‌షాహీల మూలం, కుదురు ఒక్కటే. ఆర్యుల తరువాత పర్షియన్లు వచ్చారు. వీరు వాయువ్య ప్రాంతాలను (సింధ్, పంజాబ్, కాందహార్, హీరట్) ఏలారు. మనకి ఖరోష్టి లిపిని ఇచ్చారు. ఈ లిపిని అశోకుడు అక్కడక్కడ తన శాసనాల్లో ఉపయోగించటం జరిగినది.

తదుపరి అలెగ్జాండర్ గ్రీస్ దేశం నుండి మన దేశంపై మెరుపుదాడి చేసాడు. భయంకర రక్తపాతం జరిగింది. తను వెళుతూ నాటక కళ (యవనిక), గాంధారకళ, (బుద్ధుడుని మొట్టమొ దటగా విగ్రహాల రూపంలో చెక్కిన కళ). సరైన కాల క్రమణ తేదీ 326 బిసిని అందించాడు. తదనంతరం రోమ్ దేశానికి మనకి వర్తక వ్యాపా రాలు బలంగా జరిగాయి. (శాతవాహన, మౌర్య, గుప్త). అనంతరం యూచీ తెగకు చెందిన చైనీయులయిన కుషాణులు వచ్చారు. మనదేశంలో శక సంవత్సరం అందించినది కనిష్కుడే. మన దేశ సార్వభౌమాధి కారం కాపాడటానికి చైనీయుల సిల్క్ రూట్‌ని ఆక్రమించిన రాజు కూడా కనిష్కుడే. ఇతను చైనీయుడైనప్పటికినీ మన దేశాన్ని ప్రేమించి మన మట్టిలో కలిసిపోయాడు.

అనంతరం అరబ్బులు మధ్య ఆసియా నుండి వచ్చారు. మహ్మద్ బిన్ ఖాసీం 712లో మనదేశంపై దండయాత్ర చేసి ముస్లింలు కానివారిపై మొదటిగా సింధ్ ప్రాంత రాజధాని అరోమా పై జిజియా పన్ను వేశాడు. అనంతరం వచ్చిన ముస్లింలు తమ ముస్లింలపై ఖరజ్, జకాత్ పన్నులు వేసారు. ఘజని 17 సార్లు చేసిన దండయాత్రల్లో మనకి చాలా నష్టం జరిగింది. అయితే ఘజనీ దండయాత్రల్లో రెండు ముస్లిం రాజ్యాలు కూడా ఉన్నాయి. తదుపరి ఘోరీ ఆఫ్ఘనిస్తాన్ లోని ఘోరీ ప్రాంతం నుండి వచ్చాడు.

**ద్రవిడులు,ఆర్యులు, కుషాణులు, అరబ్బులు, ఢిల్లీ సుల్తానులు, మొగలులు వివిధ ప్రాంతాల నుండి మన దేశానికి వచ్చారు. వీరందరూ మన దేశంలో స్థిరపడి మన కల్చర్‌లో కలిసిపోయారు. మన మట్టిలో మాజిక్ ఏంటో తెలుసా, ఎవరెక్కడి నుండి వచ్చినా మన దేశాన్నే తమ దేశంగా మార్చుకోవటం. భిన్నత్వంలో ఏకత్వం...ఇదేమన గొప్పతనం. ఔరంగజేబు మన దేశాన్ని ఇస్లాం దేశంగా మార్చాలని అనేక సంస్కరణలు తెచ్చాడు. చివరకు అదే మొగల్ సామ్రాజ్య పతనానికి ప్రధాన కారణం అయింది. పాలకులు ప్రజా కంటకులయినపుడు ప్రజలే తిరగబడి కులమతాల కతీతంగా బుద్ధి చెప్పారనేది మనం గమనించాలి.**




ఇండియాలో ఇతనే ఇస్లాం రాజ్యం పెట్టాడు. ఇతని సేనాని కుతుబుద్దిన్ ఐబక్ ఢిల్లీ సుల్తానుల రాజ్యానికి మూలపురుషుడు. ఈ ఢిల్లీ సుల్తానుల రాజ్యం 1206 నుండి 1526 వరకు సాగింది. ఇందులో అల్లాఉద్దీన్ ఖిల్జీ, రాజ్య సైన్య నిర్వహణ నిమిత్తం జిజియా, ఖరజ్, జకాత్, ఘరీ, చరి లాంటి పన్నులు వేసాడు. ఇతనే మనదేశంలో రైతు బజార్లకి ఆద్యుడు. బ్లాక్ మార్కెట్ దారులను లాంతరు స్తంభా లకు కట్టి ఉరి తీసేవాడు. అలానే సతీ సహగమ నాన్ని నిషేధించాడు. ఇక మహ్మద్ బీన్ తుగ్లక్‌కి పిచ్చి అనే పేరు పడినప్పటికీ అతను తన ఆస్థానంలో దీపావళి, దసరా పండుగలు నిర్వహించాడు. ప్రతిభ ఆధారంగా హిందువులకి ముస్లింలకి సమానంగా ఉద్యోగాలు ఇచ్చాడు. ఫిరోజ్‌షా తుగ్లక్ తల్లి బీబీనైలా రాజపుత్ర వనిత.

ఇక మన టాపిక్ మొగలులు. మొగలులు మన ఇండియా మ్యాప్ వెనుక ఉన్న ఎడారి దేశం మంగోలియా నుండి వచ్చారు. బాబర్ మొదలుకొని చివరి మొగల్ చక్రవర్తి రెండో బహదూర్ షా వరకు అనేక మంది మొగలులు పాలించారు. వీరిలో జహంగీర్ తల్లి జోద్‌భాయి ఒక రాజపుత్ర వనిత. రాజపుత్ర అంబర్ సంస్థానపు రాజు బీహారీమల్ బిడ్డ. రాజపుత్ర, మొగల్ స్నేహానికి గుర్తుగా అక్బం జోధబాయి పెండ్లి జరిగింది. సలీం (జహంగీరు) జన్మించాడు. అలానే షాజహాన్ తల్లి జగత్ గో సైన్ మార్వార్ రాజా ఉదయ్‌సింగ్ బిడ్డ. అంటే ఇద్దరు మొగల్ రాజులుకి తల్లి తరుపు తాతయ్యలు రాజపుత్రులు. ఇక ఔరంగజేబు దారుల్ హర్బన్‌గా ఉన్న మన దేశాన్ని ఇస్లాం దేశంగా మార్చాలని అనేక సంస్కరణలు తెచ్చాడు. అవి దేశంలోని మెజార్టీ ప్రజలను బాధపెట్టాయి. ఫలితంగా మహా రాష్ట్రులు, రాజపుత్రులు, శిక్కులు, జాట్‌లు, సత్నామీలు, అహోంలు తిరుగుబాటు చేసారు. చివరకు మత కారణం వల్ల మొగల్ సామ్రాజ్యం పతనం అయింది.

ఏ యుగానికాయుగం పాలకులు ప్రజా కంటకు లయినపుడు ప్రజలే తిరగబడి కులమతాల కతీతంగా బుద్ధి చెప్పారు. ఉదాహరణకు మహ్మద్ బీన్ తుగ్లక్ సంస్కరణలు, రాజ్యంలో ఆర్థిక అరాచకం సృష్టించగా, తట్టుకోలేక ధాగీ (గుజరాతి) అనే సామాన్యుడు ధట్టా వద్ద తుగ్లక్‌ను హత్య చేసి చంపేసాడు. గుండెల్లో పెట్టుకొని పాలించిన వారిని కులమత ప్రాంతాలకతీతంగా గుడి కట్టుకొని మరీ మన ప్రజలు సపోర్ట్ చేసారు. ఔరంగజేబుకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజలే, 1857 సిపాయిల తిరుగుబాటులో అదే మొగల్ రెండో బహదూర్ షాను తమ నాయకుడిగా మీరట్‌లో డిక్లేర్ చేసి ఢిల్లీకు బయలు దేరారు. అప్పటికే నిస్సత్తువగా, నీరసంగా, లేచి నిలబడలేని స్థితిలో వయో భారంతో కుంగిపోయి ఉన్న చివరి మొగల్ బహదూర్ షా ఎర్రకోట వదిలి సంతోషంగా సిపాయి తిరుగు బాటుకు నాయకత్వం వహించాడు. తన భార్య జీనత్ మహల్ వద్దని చెప్పినా వినకుండా!

చివరికి సిపాయిల తిరుగుబాటు విఫలం అయింది. బహదూర్ షాను, జీనత్‌ను బ్రిటీషర్స్ బర్మా జైలు రంగూన్‌లో బంధించారు. అక్కడే తాను జాఫర్ అనే కలం పేరిట భారతదేశంపై ప్రేమతో అనేక కవిత్వాలు రాసి చనిపోయాడు. మచ్చుకి ఒక కవిత్వం చూడండి.

**"ఈ పాడు దేశంలో (రంగూన్) నా మనస్సు స్థిర పడడం లేదు. నేనెంతటి దురదృష్ట వంతుడిని, నా మాతృదేశం (మదర్ లాండ్) భారతదేశంలో నాకు సమాధి కొరకు రెండు గజాల భూమి కూడా దొరకలేదు"**

అని వాపోయాడట బహదూర్ షా.

ఒక్కటి నిజం, ముస్లింలు భారతదేశంలో కట్టినన్ని కట్టడాలు ప్రపంచంలోని ఏ ముస్లీం దేశంలోనూ నిర్మించలేదు. ఇక్కడే పుట్టారు, ఇక్కడే పాలించారు, ఇక్కడి మట్టిలో జీర్ణం అయిపోయారు. మన మట్టిలో మాజిక్ ఏంటో తెలుసా, ఎవరెక్కడి నుండి వచ్చినా మన దేశాన్నే తమ దేశంగా భావించి స్వదేశీయులుగా మారిపోవటం, భారతీయ సంస్కృతి లో కలిసిపోవటం.


**బడిత ఉన్న వాడిదే బర్రె అని ఒకసామెత ఉంది. చరిత్రలో దురదృష్టం ఏమిటంటే విజేతలే చరిత్రను రాశారు. వారు పాలకులు కూడా అయి ఉంటారు.** ఒకరకంగా ముస్లీంలు మన దేశాన్ని వేయి సంవత్సరాలు పాలించారు. తప్పులు చేసిన రాజులకి అప్పటికానాడే ప్రజలు శిక్షలు కూడా వేసేసారు. చరిత్ర మంచి-చెడు రెండింటినీ సమానంగా మోసుకుపోతుంటుంది. చెడుని వదిలి మంచిని ముందుకు తీసుకెళ్ళటం మానవ జాతి లక్షణం.

మొగలులు దురాక్రమణ దారులా? విదేశీ యులా? అన్న వర్షన్ వచ్చినపుడు మనం వంశా లన్నింటికీ చెడును ఆపాదించకూడదు. పొరుగు దేశాలు (పాకిస్తాన్, చైనా) మనలను చూసి ఈర్ష్యతో చస్తున్నాయి. 'భిన్న జాతులు, భిన్న కులాలు, భిన్న మతాలున్న భారతదేశం ఏ విధంగా కలిసి మెలిసి ఉండగలుగు తుందనేది వారి ఈర్ష్యకు కారణం. ఇదేమన గొప్పతనం. భిన్నత్వంలో ఏకత్వం. ఇదే ఏకత్వం, ఐకమత్యం మొన్నటి పహల్‌గావ్ ఘటనలో కూడా చూపగలిగాం. దీంతో శత్రుదేశం తోక ముడిచింది. అలాంటిది అంతరంగికంగా మనమే బలహీనమయితే, పొరపొచ్చాలు తెచ్చుకుంటే శత్రువు దూరటానికి స్థానం ఉండదా?

ద్రవిడులు ఆఫ్రికా తదితర ప్రాంతాల నుండి, ఆర్యులు పర్షియా నుండి, కుషాణులు చైనా నుండి, అరబ్బులు అరబ్ దేశాల నుండి ఢిల్లీ సుల్తానులు టర్కీ, పర్షియా, ఆఫ్ఘన్‌ల నుండి, మొగలులు మంగో లియా నుండి, ఆంగ్లేయులు బ్రిటన్ నుండి మన దేశానికి వచ్చారు. వీరందరూ (ఆంగ్లేయులు తప్ప) మన దేశంలో స్థిరపడి మన కల్చర్‌లో కలిసిపో యారు. వీరిలో ఎవరినీ మనం ఆక్రమణ దారులు లేదా దురాక్రమణ దారులు అనలేం. చెంఘిజ్‌ఖాన్, తైమూర్, నాదిర్షా, అహ్మద్‌షా అబ్దాలీలలను దురా క్రయణదారులు అనగలం. ఎందుకంటే నాదిర్షా మన నెమలి సింహా సనాన్ని, కొల్లూరు కోహినూర్ వజ్రాన్ని ఎత్తుకొని పోయాడు. చెంఘిజ్‌ఖాన్, తైమూర్, అహ్మద్‌షా అబ్దాలీల దాడుల వల్ల మన దేశం చాలా నష్టపోయింది. అయితే ఇరాన్ (పర్షియా)తో జరిగిన యుద్ధాల్లో కోహినూర్ వజ్రాన్ని మన రంజిత్‌సింగ్ తిరిగి మనదేశానికి తీసుకు వచ్చాడు. కానీ ఇతని నుండి ఆంగ్లోసిక్ యుద్ధం తర్వాత రంజిత్ సింగ్ వారసుడు దిలీప్ సింగ్ నుంచీ 1849లో ఆంగ్లేయులు కోహినూర్ వజ్రమును లండన్‌కు తీసుకెళ్లారు. చరిత్రను మార్చలేము. చరిత్ర మనం పుట్టక ముందే చెప్పబడింది. మనం చేయవలసిందెల్లా దాని నుండి గుణపాఠాలు నేర్చుకోవటం, జాగ్రత్త పడడం. కాలగమనంలో ప్రతి దశలో దేశాన్ని విడగొట్టాలన్న శక్తులు, ఎన్నిసార్లు విజృంభించినా భారతావని ఐకమత్యంతో, దేశభక్తితో ఎదిరించి నిలిచింది, నిలుస్తుంది. ఇది గాంధీజీ, అంబేద్కర్‌లు నమ్మిన సిద్ధాంతం. నేను చనిపోయేవరకు అంటాను.

**మేరా భారత్ మహాన్.**

**కభీ భీ జెండా ఊంఛా రహే హమారా! జైహింద్!!**




హిస్టరీ రఫీసార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

# శిల్పి దురుగడ్డ బాలసుబ్రమణ్యం ఆచారికి సత్కారం

**విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ ద్వారా విజయదశమి పురస్కారం అందజేత**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** ఆళ్లగడ్డకు చెందిన ప్రముఖ శిల్ప కళాకారులు దురుగడ్డ బాల సుబ్రహ్మణ్యం ఆచారి విశ్వకర్మ ఫౌండేషన్ ద్వారా విజయదశమి పురస్కారాన్ని అందుకున్నారు. విశ్వకర్మ హార్ట్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు విజయదశమి పర్వదిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారిని సన్మానించడం జరిగింది. ఇందులో భాగంగా ఆళ్లగడ్డకు


ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న దృశ్యం

చెందిన ప్రముఖ శిల్ప కళాకారులు దురుగడ్డ బాలసుబ్రమణ్యం ఆచారిని వారు సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రం తొలి శాసనసభాపతి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి , బ్రహ్మం గారి మఠం ఈశ్వరీ దేవి మఠం పీఠాధిపతి వీర కుమారస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి ఎనిమిదో తరం ముని మనవలు నొస్సం వీరం బొట్లయ్య స్వామి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోవడం జరిగింది. ఆళ్లగడ్డ లో శిల్పకళలకు ప్రాణం పోసిన దురుగడ్డ కుటుంబం రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు కెక్కడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నదీ కైరవాడి అంగన్వాడీ కేంద్రానికి స్వచ్ఛత అవార్డు

**నందవరం మేజర్ న్యూస్ :** నందవరం మండలంలోని కొత్త కైరవడి గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి స్వచ్ఛత అవార్డు లభించింది.. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ 2025 అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా నదికైరవాడి అంగన్వాడీ కేంద్రం అధ్యాపకురాలు శమంతక మణి స్వచ్ఛ్ ఆంధ్ర సేవలు గుర్తించి రాష్ట్ర మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని, అవార్డును అందించారు. సోమవారం సునీల్ అన్న ఆడిటోరియంలో జరిగిన ఈకార్యక్రమంలో స్వచ్ఛఅంగన్వాడి కేంద్రాలకు అందించిన అవార్డు ప్రధాన ఉత్సవాలకు ఆహ్వానం అందిన మేరకు శమంతకమణి హాజరయ్యారు హాజరయ్యారు. అక్కడ ఆమెను ఘనంగా సత్కరించి, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ లో భాగంగా కీలక పాత్ర పోషించిన మీలాంటి అంగన్వాడీ టీచర్ల వల్ల ప్రతి పల్లె.. ప్రతి వార్డు స్వచ్ఛతగా నెలకొల్పాలని, ఇది భారత దేశ పౌరులు ప్రతి ఒక్కరి బాధ్యత అని



మీలాంటి స్ఫూర్తి ప్రతి ఒక్కరికి రావాలంటూ అధికారులు ఆకాంక్షించారు, జిల్లా పశ్చిమ ప్రాంతానికి చెందిన నందవరం మండలం నదీ కైరవాడి గ్రామానికి సుజాత అవార్డు రావడం హర్షించదగ్గ విషయమని ఎమ్మిగనూరు అంగన్వాడి ప్రాజెక్టు అధికారులు శమంతక మణి ని అభినందించారు.

# వృద్ధ దంపతులకు గృహ నిర్మాణం చేపట్టిన టేకురి నాగేశ్వరరావు

**పాములపాడు మేజర్ న్యూస్ :** పాములపాడు మండలం భానకచర్ల గ్రామంలో సింగపూర్ టేకూరి నాగేశ్వరరావు పి4 కార్యక్రమంలో భాగంగా సేవా కార్యక్రమం చేపట్టారు. వివరాల్లోకి వెళితే వేంపెంట గ్రామానికి చెందిన టేకూరి కృష్ణుడు మాజీ సర్పంచ్ రామ సుబ్బమ్మల కుమారుడు టేకురి నాగేశ్వరరావు,ఒక నిరుపేద కుటుంబానికి హామీ ఇచ్చిన విధంగా జంగాల సుంకుర రామారావు అనే వృద్ధ దంపతులకు, ప్రపంచ నివాస దినోత్సవం సందర్భంగా కొత్త ఇల్లు నిర్మాణానికి



శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు ఇంటి నిర్మాణం నిర్మాణ పనులను ప్రారంభించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు ఈ సందర్భంలో గ్రామ ప్రజలు సింగపూర్ టేకూరి నాగేశ్వరరావు గారిని అభినందిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. కేవలం గ్రామ అభివృద్ధితోనే కాకుండా మండల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని పలువురు నాయకులు కార్యకర్తలు కోరుతున్నారు .కార్యక్రమంలో బండ్లమూరి చంద్రశేఖర్, చిట్టి నాగార్జున రెడ్డి, అంబరపు నారాయణ గౌడ్, నాగేశ్వరరావు, గోపాల్ రెడ్డి, గట్టు లింగేశ్వర్ గౌడ్, మోతే శివలింగం, వినయ్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలి



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమం కింద గ్రామంలో ప్రతి కుటుంబ సభ్యులు మీయొక్క ఇంటి పరిసరాలను పరిశుభ్రంగాఉండేటట్లు చూడాలని గవిగట్టు గ్రామ సర్పంచ్ నాగరాజు అన్నారు. సోమవారం గవిగట్టు గ్రామ పంచాయతీ కార్యాలయం లో పంచాయతీ కార్యదర్శిఅధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామీణా ఉపాధి హామీ పథకం కింద గత సంవత్సరంలో చేపట్టిన పనులు మొత్తం 50.పనులకుమొత్తం అంచనా విలువ రూ.35లక్షలు అందులో పూర్తి చేసిన పనులు 28 అందులోరూ30లకలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రాబోయే సంవత్సరానికి అవసరమైన పనిదినాలు15వేలుగుర్తించ వలసిన పనులువిలువ1.000.0000.ఐహెచ్ఎల్ కింద మరుగుదొడ్లు లేని కుటుంబాలువారు లబ్ధిదారులు ధరఖాస్తు చేసుకోవాలి. అలాగే ప్రతి కుటుంబం తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ బండిలో పోడి చెత్తను వేయాలని అయన సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఆదోని తహసీల్దార్ పై చర్య తప్పదా..?

**-విధుల నిర్లక్ష్యం పట్ల సరెండర్ నోటీస్..**

**-జిల్లా కలెక్టర్ తో సంప్రదింపులు సఫలమేనా..?**

**ఆదోని, మేజర్ న్యూస్:** విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించారనే అభియోగంపై ఆదోని తహసీల్దార్ రమేష్ పై ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ చర్యలకు ఉపక్రమించారు. సెప్టెంబర్ నెలాఖరులో ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఆదోని పట్టణంలో వరద భీభత్సం సృష్టించింది. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలను అప్రమత్తం చేయడంలోను, సహాయక చర్యలు చేయడంలోనూ బాధితులను పట్టించుకోవడం పట్ల స్థానిక ఎమ్మార్వో విఫలమయ్యారనే విమర్శలు ప్రజల నుంచి వినిపించాయి. దీంతో ఆగ్రహించిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఎమ్మార్వో రమేష్ ను సరెండర్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఆ మరుసటి రోజు నుండి డిప్యూటీ తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తాసిల్దార్ బాబుకు తాత్కాలికంగా తహసీల్దార్ బాధ్యతలను అప్పజెప్పారు. అందులో భాగంగానే సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల వేదికను బాబు తహసీల్దార్ హోదాలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఇది


సరెండర్ నోటీసు అందుకున్న తహసిల్దార్ రమేష్

ఇట్లుండగా.. తహసీల్దార్ రమేష్ సరెండర్ పట్ల రాజకీయ నాయకులలోను, అధికారులలోనూ పట్టణంలో తీవ్ర చర్చ కొనసాగుతుంది. ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఎమ్మార్వోకు ఇచ్చిన సరెండర్ నోటీసుపై కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి కూడా ఆదోని ఎమ్మార్వో పై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించినట్లు సమాచారం వెలివేడుతుంది. ఈ వ్యవహారంపై తాసిల్దార్ రమేష్ తన తప్పును సరిదిద్దుకునే ప్రయత్నంలో భాగంగా, ఎమ్మెల్యే పార్థసారథి సారథ్యంతో కలెక్టర్ సిరిని కలిసి సరెండర్ నోటీస్ పై వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ మాత్రం విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన తాసిల్దార్ పై చర్యలను కొనసాగిస్తుందా..! లేక మరికొన్ని రోజులు పాటు సరెండర్లో ఉండనిస్తారా..!! అన్న సంగతి అధికారుల నుండి ఖచ్చితమైన సమాచారం రావాల్సి ఉంది..

## రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిని కలిసిన కడియాల గజేంద్ర గోపాల్ నాయుడు

**గూడూరు,మేజర్న్యూస్:** కర్నూలు, నంద్యాల జిల్లాలో ఈనెల16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన ఉన్నందున ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్, కర్నూలుకు రావడంతో గూడూరు బిజెపి నాయకుడు కడియాల గజేంద్ర గోపాల్ నాయుడు



ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడియాల గజేంద్ర గోపాల నాయుడు మాట్లాడుతూ ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నంద్యాల, కర్నూల్ జిల్లాలో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు వస్తున్నందున ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన బిజెపిరాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కర్నూలులో మర్యాదపూర్వకంగా కలిశామన్నారు.కోడుమూరు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లి వాటిని పరిష్కరించాలని కోరడం జరిగిందని తెలిపారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు



**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** ఇంటర్మీడియట్ బై.పి.సి ప్రథమ సంవత్సరం చదువుతున్న టి. లక్ష్మి శాంతి విజయవాడలోని ఐజిఎంసి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి 600 మీటర్స్ రన్నింగ్ రేస్‌లో ప్రథమ స్థానం మరియు మిడ్‌లే ఈ వెంట్‌లోను 2వ స్థానం సాధించి నేడు నేషనల్‌కు సెలెక్ట్ అయినట్లు ప్రిన్సిపల్ కె. సంజీవ రెడ్డి తెలిపారు. ప్రశాంతి క్రీడల్లో పాల్గొనడం వల్ల టీం అంతా సెకండ్ ప్లేస్ సాధించినట్లు చెప్పారు. ఒరిస్సాలో జరగబోయే నేషనల్స్‌లో కూడా విజయం సాధించాలని ఉపాధ్యాయ బృందం అంతా ఆకాంక్షించాలని ఉపాధ్యాయ బృందమంతా ఆకాంక్షించి అమ్మాయిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు గుర్రప్ప, పి.డి గంగాదేవి, రాధారాణి, అరుణ, మధుసూదన్ రావు, పరమేష్, మల్లికార్జున తదితరులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

**ఉమ్మాయిపల్లె పాఠశాలకు స్వచ్ఛాంధ్ర అవార్డు :** ఎంపిపి స్కూల్ ఎస్టీ ఉమ్మాయిపల్లె పాఠశాలకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు కలెక్టర్ చేతులమీదుగా ఇవ్వడం జరిగింది. ఈ అవార్డు ప్రధానోపాధ్యాయులు రామయ్య మరియు ఎంఈఒ అబ్దుల్ కలాం తీసుకోవడం జరిగింది.

# 44 జాతీయ "నరక" రహదారి

**కృష్ణగిరి,మేజర్న్యూస్:** నెంబర్44 జాతీయ రహదారి కాదు ఇది..గుంతలమయమైన అధ్వాన్న నరక రహదారిగా మారిందని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు.జాతీయ రహదారిలోని అమకతాడు టోల్‌ప్లాజా దగ్గర నిర్వాహకులను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 44




జాతీయ రహదారిలో కర్నూలు నుండి అనంతపురం వరకు రోడ్డు గుంతలమయమైందని ఆయన వాపోయారు.కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రోడ్డుకు కర్నూలు అనంతపురం మద్యన ఉన్న ప్రయాణికులకు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు.ఫాస్ట్‌ట్యాగ్‌తో ప్రయాణికులకు జేబులు ఖాళీ చేస్తున్నారే గానీ ..రోడ్డు మరమ్మత్తులకు ఊసే ఎత్తడం లేదని ఆయన ధ్వజమెత్తారు.సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించకపోతే అమకతాడు టోల్‌ప్లాజా వద్ద మరింత ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కోయిలకొండ నాగరాజు,రాంమోహన్,బండపల్లి నాగరాజు,మనోహర్,కరీం,ఇంకా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# పోషణతోపాటు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

**వెల్దుర్తి, మేజర్న్యూస్:** చిన్నారులకు పోషణతో పాటు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని వెల్దుర్తి ఐసిడిఎస్ సిడిపిఓ లుక్ అన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా సోమవారం వెల్దుర్తి ప్రాజెక్ట్ వెల్దుర్తి పట్టణంలోని 9వ అంగన్‌వాడి కేంద్రం నందు సిడిపిఓ లుక్, సూపర్‌వైజర్ పద్మావతమ్మల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ లుక్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు, పిల్లలకు బాల్యం ఆరంభ దశ విద్య పోషక ప్రాముఖ్యత గురించి వివరించామన్నారు. పిల్లల యొక్క ప్రీ స్కూల్ పూర్వం ప్రాథమిక భాష, విద్య, మానసిక, శారీరకంగా, మేధ, సృజనాత్మకత అభివృద్ధి ఐదు దశల గురించి వివరించారు. పోషణలో ముఖ్యంగా ఉభకాయస్థితిని తగ్గించడానికి కొన్ని పిండి పదార్థాలలో ఉపయోగించి వాటిని ఎలా తయారు చేసుకోవాలి, చిరుధాన్యాలు జొన్నలు తీసుకోవడం వల్ల ఎక్కువ ఐరన్, క్యాల్షియం విటమిన్లు వంటి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. జొన్న పిండితో జొన్న మురుకులు, జొన్న బర్ఫీలు, జొన్న లడ్డు, జొన్న పిండిలో ఆకుకూరలు కలిపి వివిధ తిరు పదార్థాలు తయారు చేసే విధానాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె మమత, అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్లు, గ్రామ ప్రజలు, చిన్నారుల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.



# కలిసి పని చేస్తే "స్వచ్ఛ ఆంధ్ర" సాధ్యం : మంత్రి టీజీ భరత్

రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్



**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసి పని చేసినప్పుడే "స్వచ్ఛ ఆంధ్ర" సాధ్యమవుతుందని రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ మధ్యనే జపాన్ దేశం పర్యటనకు వెళ్లానని , జపాన్ లో చెత్త నుండి ఆదాయం వచ్చే విధంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు.. ప్రస్తుతం అక్కడ చెత్త వేయటానికి చెత్తబుట్టలు లేవని, నిర్దిష్టమైన స్థలాల్లో మాత్రమే చెత్త వేయటానికి చెత్తబుట్టలు ఉంటాయన్నారు. కర్నూలు నగరంలో వర్షానికి కాలువలు నిండిపోయి ఇబ్బందులు పడడానికి మన ఇంటిలోని చెత్తను కాలువలో వేయటం అన్నారు.దీన్ని మనము అరికట్టి కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. జపాన్ లో హైడ్రోజన్ ను ఇంధనం గా వినియోగించి కార్లు వాడుతున్నారని, మనం ఆ టెక్నాలజీని అలవర్చుకోవడానికి ఇంకా ఆలోచిస్తూ ఉన్నామన్నారు. వాడేసిన ఖాళీ సీసాలు తిరిగి వాడుకలోకి తీసుకుని రావడానికి ప్రభుత్వము నుండి చర్యలు ఉంటాయన్నారు. కర్నూల్ లో కూడా వేస్ట్ నుండి కరెంటు ఉత్పత్తి చేసే చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర తోనే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛత హి సేవ అనే నినాదంతో కార్యక్రమాలను మొదలు పెట్టిందన్నారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, అదే విధంగా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా, ఉమ్మి వేయకుండా ఉండాల ని అప్పుడే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ సాధించుకోగలుగు తామన్నారు పాణ్యం నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్య మంత్రి సీఎం అస్యూరెన్స్ కింద 50 కోట్ల రూపాయ లను మంజూ రు చేశారన్నారు. ప్రజలు చెత్తను తడి పొడి చెత్తగా వేరుచేసుకొని పెట్టుకోవాలన్నారు.అనంతరం ఉత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీ, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ స్లామ్ లెవెల్ ఫెడరేషన్, స్వచ్ఛ రైతు బజార్, స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్, స్వచ్ఛ బస్ స్టేషన్, స్వచ్ఛ ఎన్జీఓ లు, స్వచ్ఛ ఆసుపత్రి, స్వచ్ఛ పాఠశాల, స్వచ్ఛ అంగన్వాడి, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛ హాస్టల్ లు, స్వచ్ఛ పరిశ్రమలు, స్వచ్ఛ రెసిడెన్షియల్ పాఠశాలలు, స్వచ్ఛ పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ లకు మంత్రి, జాయింట్ కలెక్టర్ అవార్డ్ లను ప్రధానం చేశారు.

## కరెన్సీ నోట్లపై మత ప్రచారం

### – రిజర్వ్ బ్యాంకు ఆగ్రహం




500కరెన్సీ నోట్

**కర్నూలు సూర్య ప్రతినిధి :** ఇంత కాలం సాధారణ కాగితాలకే పరిమితమైన మత ప్రచారం ఇపుడు ఏకంగా కరెన్సీ నోట్లకు చేరింది. తమ మత ప్రచారం కోసం లవ్ సింబల్ వేసి కింద మతం పేరును రబ్బర్ స్టాంపు వేస్తున్నారు. ఈ రబ్బర్ స్టాంపు అత్యధికంగా రూ.500 కరెన్సీ నోట్లపై వేస్తున్నారు. ఈ కరెన్సీ నోట్లు ఇపుడు ప్రజల్లో విస్తృతంగా చలామణిలో ఉన్నాయి. మత ప్రచారాన్ని అంగీకరించని ఇతర మతస్థులు రిజర్వ్ బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అంతేగాక ఈ తరహా ప్రచారం ఏంటని నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నిస్తూ వైరల్ చేస్తున్నారు. కాగా కరెన్సీ నోట్లపై మత ప్రచారం చేయవద్దని రిజర్వ్ బ్యాంకు కూడా స్పందించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు పలు రకాల రిజర్వ్ బ్యాంకు తాకీదులు అంటూ పోస్ట్ చేస్తున్నారు. ఈ సారాంశం ప్రకారం కరెన్సీ నోట్లపై ఎలాంటి రాతలు ఉన్నా ప్రజలు స్వీకరించవద్దని అందులో ప్రత్యేకంగా మత ప్రచారం ఉన్న కరెన్సీ నోట్ల ప్రజలు అంగీకరించవద్దని స్పష్టం చేశారు. మత ప్రచారం చేస్తూ రబ్బర్ స్టాంపు వేసిన కరెన్సీ నోట్ల బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలని ఆ తాకీదుల్లో ఉంది. అయితే మత ప్రచారం ఉన్న కరెన్సీ నోట్లను వెనక్కి తీసుకొని వాటి స్థానంలో కొత్త నోట్లను జారీ చేయాలని అలాగే ఆ తరువాత అలాంటి నోట్లను ఎవరు చలామణి చేసేందుకు ప్రయత్నించినా చెల్లని నోట్లుగా పరిగణిస్తే తప్ప ఇలాంటి తరహా మత ప్రచారం ఆగదని పలువురు సామాజిక మాధ్యమాల్లో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రిజర్వ్ బ్యాంకు ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## నిండుకుండలా శ్రీశైలం జలాశయం

- డ్యామ్ ఒక్క గేటు ద్వారా నీటి విడుదల ప్రారంభం
- ఈ ఏడాది 8వ సారి గేట్ల ఎత్తివేత
- ఇన్ ఫ్లో 1,19,613 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో 90,720 క్యూసెక్కులు
- డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం
- 885 అడుగులకు చేరిక




శ్రీశైలం ప్రాజెక్టు ఒక్క గేటు ద్వారా నీరు విడుదల అవుతున్న దృశ్యం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారి డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు చేరుకుంది. మరోవైపు ఎగువ పరివాహక ప్రాంతాల నుండి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో సోమవారం సాయంత్రం 5:30 గంటలకు డ్యామ్ ఒక్క గేటు ద్వారా నాగార్జునసాగర్కు మళ్ళీ నీటి విడుదలను జల వనరుల శాఖ అధికారులు ప్రారంభించారు.ఈ ఏడాది ఎనిమిదోసారి డ్యాం గేట్లు తెరుచుకోవడం విశేషం.సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల, సుంకేసుల హంద్రీ ప్రాజెక్టుల ద్వారా 1,19,613 క్యూసెక్కుల వరద నీరు వచ్చి శ్రీశైలం జలాశయానికి చేరుతోంది.డ్యాం ఒక్క గేటు ద్వారా28,075 క్యూసెక్కులు రెండు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 62,645 క్యూసెక్కులు మొత్తంగా 90,720 చూసి చెక్కుల నీటిని నాగార్జున సాగర్ కు విడుదల చేశారు. కాగా జలాశయం బ్యాక్ వాటర్ ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కు 5 వేల క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ కు2,830 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.నీటి ఆవిరి రూపంలో 165 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.అలాగే గడిచి 24 గంటల వ్యవధిలో కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 29,995 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 15.082 మిలియన్ యూనిట్లు, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 38,876 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 17.127 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు.విద్యుత్ ఉత్పత్తి అనంతరం ఆ నీరు నాగార్జునసాగర్కు విడుదలైంది. ప్రస్తుతం డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు..నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి.వరద ప్రవాహం పెరిగితే మరో రెండు గేట్లను ఎత్తివేస్తామని అధికారులు తెలిపారు.

## శ్రీశైలం-హైదరాబాద్ రహదారి పై ఎలుగుబంటి

**శ్రీశైలం మేజర్ న్యూస్:** శ్రీశైలం – హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి ఎలుగుబంటి సంచరించింది.సున్నిపెంట స్మశానం వద్ద రహదారి పక్కన రాత్రి 10 గంటల సమయంలో ఓ ఎలుగుబంటి ఆహారం తింటున్న దృశ్యాన్ని కొందరు భక్తులు వీడియో తీశారు.శ్రీశైలం పరిసర రహదారులపై తరచుగా చిరుత పులి,ఎలుగుబంటి సంచారం పరిపాటిగా మారింది.రాత్రి వేళలో టూవీలర్లపై శ్రీశైలం వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అటవీశాఖ అధికారులు తెలిపారు.



## రాయలసీమ డిక్లరేషన్ అమలుకై కృషి చేయాలి

### –మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్




మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్

**కర్నూలు, మేజర్న్యూస్ :** భారతీయ జనతా పార్టీ ఆ ద్వర్యంలో చేపట్టిన రాయలసీమ డిక్లరేషన్ను అమలు చేసేందుకు ప్రతి బిజెపి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. బిజెపి రాష్ట్ర యువ మోర్చ అధ్యక్షుడుగా సునీల్ రెడ్డి ప్రమాణస్వీకారం స్థానిక బిఏఎస్ కళాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీజీ వెంకటేష్ మాట్లాడుతూ రాయలసీమ వెనుకబాటు తనాన్ని తొలగించి సర్వత్రా అభివృద్ధి చేసేందుకు బిజెపి ఆద్వర్యంలో డిక్లరేషన్ చేశామన్నారు. దానిని అమలు పరిస్తే రాయలసీమలో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఎన్నో పరిశ్రమలు ఏర్పడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడే అన్ని రకాల అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది కాబట్టి ఉద్యమాలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన జిల్లాలకు కోట్ల రూపాయలు అందించేందని వాటి సాధనకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కృషి చేయాలని టీజీ వెంకటేష్ కోరారు.

## ప్రజా ఫిర్యాదులను విచారణ జరిపి న్యాయం చేస్తాం

### – జిల్లా ఎస్పీ విక్రాంత్పాటిల్



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

**కర్నూలు క్రైం, మేజర్న్యూస్ :** ప్రజా ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం నగరంలోని కొత్తపేటలో టుటౌన్ పోలీస్స్టేషన్ పక్కనున్న ఎస్పీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతుల రూపంలో స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 58 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ఫిర్యాదులలో కొన్ని రైల్వే శాఖలో ప్రభుత్వ ఉద్యోగం లేదా మైక్రో సాఫ్ట్వేర్లో ప్రైవేటు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి హైదరాబాద్కు చెందిన విజయభాస్కర్ రూ.7లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలుకు చెందిన దినేష్ నాయుడు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

-కర్నూలులో రాష్ట్రస్థాయి జయంత్యోత్సవం -హాజరు కానున్న బీసీ మంత్రి సవిత

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది నుంచి మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయిస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అక్టోబర్ ఏడో తేదీన మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల నేతృత్వంలో వాల్మీకి జయింతిని నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్ సహా పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్కు అప్పట్లో భారీ సంఖ్యలో వినతులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో బీసీల ఆత్మగౌరవానికి ప్రాముఖ్యతనిస్తూ, ఇచ్చిన హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించాలని నిర్ణయం తీసుకుందని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

## అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

### – నగరపాలక కమీషనర్ విశ్వనాథ్



ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమీషనర్

**కర్నూలు(కెఎంసి), మేజర్న్యూస్ :** ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం చేయొద్దని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని నగరపాలక కమీషనర్ విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 19 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమీషనర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఆర్ఓ జునైద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.